సాక్షి
గుంటూరు
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



యాదవ హైస్కూలో ఎస్పీ తనిఖీలు


నగరంపాలెం: యాదవ హైస్కూల్‌లో జరుగుతున్న 'పది' పరీక్షల సరళిని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గురువారం పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,500, మోడల్ ధర రూ.4,300 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
గుంటూరు	6:27	4:41
నరసరావుపేట	6:29	4:39
బాపట్ల	6:27	4:41

న్యూస్‌రీల్

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ద్వితీయ భాష పరీక్షకు గుంటూరు జిల్లాలో 99.34 శాతం హాజరు నమోదైంది. 138 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 26,382 మంది విద్యార్థులకు గానూ 26,219 మంది హాజరయ్యారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తాడేపల్లిలోని మూడు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా డీఈఓ పి.శైలజ ఐదు, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు ఒకటి చొప్పున తనిఖీ చేయగా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 32 కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 99.03 శాతం హాజరు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పరీక్షలలో భాగంగా గురువారం జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 99.03 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. జిల్లా పరిధిలోని 126 సెంటర్లలో 24,305మంది విద్యార్థులకు గాను 24,084మంది విద్యార్థులు హాజరయ్యారని, మరో 221మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. పరీక్ష నిర్వహణలో ఫ్లయింగ్ స్క్వాడ్ 10టీమ్‌లు, మరో 45 సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది విధులు నిర్వహించారని తెలిపారు.

గుడ్‌ఫ్రైడే రోజు తరగతులా ?

ప్రభుత్వ మార్గదర్శకాలను మీరితే కఠిన చర్యలు : డీఈఓ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా జాతీయ పండుగలు, పర్వదినాల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఆరు రోజుల్లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు సెలవులుగా ప్రకటించిన దృష్ట్యా, నష్టపోయిన పనిదినాలను ఇతర సెలవు దినాల్లో పాఠశాలల నిర్వహణ ద్వారా భర్తీ చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలచుకోవడాన్ని డీఈఓ శైలజ తప్పుబట్టారు. నష్టపోతున్న పనిదినాలను ఆదివారాల్లోనే భర్తీ చేయాలని, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వంటి పండుగల ద్వారా భర్తీ చేసేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. గుడ్‌ఫ్రైడే రోజున విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు సిద్ధమైన గుంటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు ఆమె చెప్పారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ పి.శైలజ పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ వరకు జరగనున్న పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆమె ఆదేశించారు. డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శైలజ మాట్లాడుతూ ఏపీఓఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య టెన్త్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా ఎనిమిది కేంద్రాల పరిధిలో 1,744 మంది, 14 కేంద్రాల్లో జరుగుతున్న దూరవిద్య ఇంటర్ పరీక్షలకు 3,352 మంది చొప్పున హాజరవుతున్నట్లు తెలిపారు.

10,11 తేదీల్లో కోవిడ్ మాక్ డ్రిల్

గుంటూరు మెడికల్: పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10, 11 తేదీల్లో గుంటూరు జీజీహెచ్‌తోపాటు, పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు గురువారం తెలిపారు. ఆయా ఆసుపత్రుల్లో కరోనా ఏర్పాట్లకు సంబంధించి మాక్ డ్రిల్‌లో భాగంగా పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

ఆరోగ్య ప్రదాతకు బ్రహ్మరథం

జనహృదయ నేత.. సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్ రాకతో చిలకలూరిపేట పులకించింది. నేల ఈనిందా అన్నట్లుగా తమ ప్రాంతానికి మొదటిసారి వచ్చిన సంక్షేమ రథసారథిని చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అన్నిదారులూ అటువైపే సాగగా సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రోగుల చెంతకే వైద్యుడు.. ఇంటివద్దకే వైద్యం అనే వినూత్న విధానం ప్రారంభానికి పేట పట్టణం వేదికవగా.. సీఎం కురిపించిన అభివృద్ధి వరాల జల్లుల్లో సభికులు తడిసి ముద్దయి తమ కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ప్రసంగిస్తున్నంతసేపు ప్రాంగణమంతా జగన్నినాదంతో హోరెత్తింది.

- 'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభానికి చిలకలూరిపేటకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పేటకు వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి
- తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.63 కోట్లు
- ముస్లిం శ్మశానవాటికకు 3 ఎకరాల భూమి కేటాయింపు
- అంబేడ్కర్, బీసీ, కాపు సామాజిక భవనాలు మంజూరు
- సాగునీటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతుల నిధులకు హామీ
- హర్షధ్వానాలతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

సాక్షి, నరసరావుపేట, చిలకలూరిపేట: వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి, ఫ్యామిలీ డాక్టర్ విధానం లాంటి విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడానికి చిలకలూరిపేటకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాడు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలివచ్చి పేదల ఇంటి వద్దకే వైద్యం అందించే కార్యక్రమానికి తమ మద్దతు ప్రకటించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో గురువారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రారంభోత్సవ సభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. సభకు వచ్చిన ప్రజలు కేరింతలు, నినాదాలతో సందడితో సభ ఉత్తేజభరితంగా మారింది.



లింగంగుంట్ల హెల్త్ విలేజ్ క్లినిక్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు

హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం...

జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సాదరస్వాగతం పలికారు. మంత్రులు కారుమూరి నాగేశ్వరావు, అంబటి రాంబాబు, విడదల రజని, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జంగా కృష్ణామూర్తి, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి, నంబూరు శంకర్‌రావు, అన్నాబత్తుని శివకుమార్, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఏసురత్నం, తలశిల రఘురాం, అప్పిరెడ్డి, పోతుల సునీత, కల్పలత, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు మర్యాద పూర్వకంగా కలసి స్వాగతం పలికారు.

రోగులకు అందే సేవలపై ఆరా...

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఉదయం పది గంటలకు లింగంగుంట్లలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన లింగంగుంట్లలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు చేరుకున్నారు. హెల్త్ క్లినిక్‌లో అందుతున్న సేవల గురించి వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సీఎంకు వివరించారు. పక్కనే ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ స్టాళ్లను పరిశీలించారు. అక్కడ చిన్నారులను సీఎం అప్యాయంగా పలకరించారు. అక్కడి నుంచి సభా ప్రాంగణానికి ఉదయం 11.03 గంటలకు చేరుకున్నారు. సభావేదికపై ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కార్యక్రమం ప్రారంభించారు.



లింగంగుంట్ల హెల్త్ విలేజ్ క్లినిక్‌లో చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దేశంలో మరెక్కడా లేని విధానమిది : కలెక్టర్



గతంలో లాగా వైద్యం కోసం డాక్టర్‌ల చుట్టూ రోగులు తిరగాల్సిన పరిస్థితి లేకుండా మన ఊరిలోనే, మన ఇంటికే వచ్చి ఉచితంగా వైద్యం అందించేలా దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని జిల్లా కలెక్టర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీకి కనీసం ఇద్దరు డాక్టర్లు ఉన్నారని, ప్రతి పీహెచ్‌సీకి ఒక 104 వాహనం అనుసంధానం చేసి, ఓ డాక్టర్ పీహెచ్‌సీలో ఉంటే మరో డాక్టర్ ప్రతి రోజు తనకు కేటాయించిన గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని గత సంవత్సరం అక్టోబర్ నుంచి జిల్లాలో పైలెట్ పథకంగా ప్రారంభించి 1,38,859 మందికి వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. ఇంతంటి గొప్ప కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో ప్రారంభిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పాఠ్యం... ప్రథమం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవులకు ముందుగానే పాఠ్య పుస్తకాలు సిద్ధమవుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరంలో పునఃప్రారంభానికి ముందుగానే పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చాలనే నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి యేటా పాఠశాలలు తెరవకముందే పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాల పంపిణీ జరుగుతోంది. అదే ఒరవడిలో కొద్దిరోజుల కిందటే గుంటూరు జిల్లా కేంద్రానికి తొలి విడతలో పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికగా పాఠ్య పుస్తక పంపిణీ చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు 23 లక్షల పాఠ్యపుస్తకాలు..

ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే ప్రతి ఒక్క విద్యార్థికీ పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తుంది. జగనన్న విద్యాకానుక కిట్‌లో చేర్చి పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలను ముద్రణ చేస్తున్న ప్రభుత్వం వాటిని ఎప్పటికప్పుడు జిల్లాకు చేర్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 3,607 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా 4,18,678 మంది విద్యార్థులకు 2023-24 విద్యాసంవత్సరానికి 23 లక్షల పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్‌బుక్స్‌ను కలుపుకొని మొత్తం 47 లక్షల పుస్తకాలకు ప్రభుత్వానికి ఇండెంట్ పంపించారు.

పూర్తి నాణ్యత ప్రమాణాలతో..

జిల్లా నుంచి పంపిన ఇండెంట్ ఆధారంగా మొత్తం పుస్తకాలను మూడు విడతల్లో పంపేందుకు నిర్ణయించిన ప్రభుత్వం మొదటి విడతలో 10.92 లక్షల పుస్తకాలకు గాను రెండు లక్షల పుస్తకాలు వచ్చాయి. వీటిలో పదో తరగతి పాఠ్యాంశాల పుస్తకాలు ఉన్నాయి. పాఠ్య పుస్తక ముద్రణ కేంద్రాల నుంచి జిల్లాకు వచ్చిన పుస్తకాలను గుంటూరు నగరంలోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాముల్లో నిల్వ చేశారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పాఠ్య పుస్తకాల ముద్రణ చేపడుతున్న ప్రభుత్వం, ముద్రణ పూర్తయిన పాఠ్య పుస్తకాలను ఎప్పటికప్పుడు జిల్లాకు పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాలకు ఆర్టీసీ కార్గో బస్సుల్లో రవాణాకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఆర్టీసీ కార్గో బస్సుల్లో మండల స్టాక్ పాయింట్లకు పంపుతామని జిల్లా పాఠ్య పుస్తక మేనేజర్ వనమా వజ్రబాబు చెప్పారు.

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే వచ్చిన పాఠ్యపుస్తకాలు

- సెలవులకు ముందుగానే వచ్చే విద్యాసంవత్సరానికి ప్రణాళిక
- గుంటూరు జిల్లా కేంద్రానికి ప్రారంభమైన పాఠ్య పుస్తకాల రాక
- ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన పుస్తకాల సరఫరా



గుంటూరు పాఠ్య పుస్తక గోదాము వద్ద పుస్తకాల లోడ్‌ను దింపుతున్న కార్మికులు

'పేట'కు వరాలు..



హెల్త్ విలేజ్ క్లినిక్ సిబ్బందితో సీఎం వైఎస్ జగన్, మంత్రి రజిని

సాక్షి, నరసరావుపేట, చిలకలూరిపేట: చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించిన కొన్ని సమస్యలను మంత్రి విడదల రజని ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు. ఈక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో చిలకలూరిపేటకు వరాల జల్లు కురిపించారు.

- చిలకలూరిపేట పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే రూ. 150 కోట్ల అమృత్ పథకం పనులు జరుగుతున్నాయని ఇందులో రూ. 63 కోట్లను పురపాలక సంఘం భరించాల్సి ఉండగా, ఆ నిధులను ప్రభుత్వం తరఫున విడుదల చేస్తామని సీఎం ప్రకటించారు.
- ఎస్సీలకు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, బీసీలకు బీసీ భవన్, కాపులకు కాపు భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారు.
- ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటుకు విడదల రజనీ తన సొంత నిధులతో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేయగా, దానికి అదనంగా మరో మూడు ఎకరాలు ప్రభుత్వం తరఫున కొనుగోలు చేసి ఇస్తామని తెలిపారు. అందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని వేదిక మీదనుంచే పల్నాడు కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు.
- చిలకలూరిపేట రైతులకు మేలు చేసే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తానని హామీ నిచ్చారు. చిలకలూరిపేటకు వరాలు కురిపించిన సీఎంకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. చప్పట్లు, కేరింతలతో మద్దతు తెలిపారు.

8 నుంచి గుంటూరు మీదుగా వందేభారత్ రైలు

వివరాలు వెల్లడించిన డీఆర్‌ఎం రామకృష్ణ



మాట్లాడుతున్న గుంటూరు డీఆర్‌ఎం ఆర్.రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా నడిచే వందే భారత్ రైలును ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని గుంటూరు డీఆర్‌ఎం ఆర్.రామకృష్ణ వెల్లడించారు. స్థానిక పట్టాభిపురంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందే భారత్ రైలులో సికింద్రబాద్ నుంచి తిరుపతికి 8.30 గంటల్లోనే ప్రయాణికులు చేరుకుంటారని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు కేవలం 3.45 గంటల వ్యవధిలో రైలు చేరుకుంటుందన్నారు. ఈనెల 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన రోజు మాత్రం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఉదయం 11.30 గంటలకు రైలు బయలు దేరి నల్గొండ, మిరియాలగూడ, పిడుగురాళ్ల మీదుగా గుంటూరు రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 3.35 గంటలకు చేరుకుంటుందని, అక్కడ నుంచి తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురుల మీదుగా తిరుపతి స్టేషన్‌కు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 20701 నంబరుతో నడిచే ఈ రైలు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలు దేరి గుంటూరుకు 9.45 గంటలకు చేరుకుందని, గుంటూరులో 10 నిమిషాల పాటు వేచి ఉండి, అక్కడ నుంచి ఒంగోలు, నెల్లూరుల మీదుగా తిరుపతి స్టేషన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే 20702 నంబరు వందేభారత్ రైలు తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు బయలు దేరి గుంటూరుకు రాత్రి 7.45 గంటలకు చేరుకుని, ఇక్కడినుంచి సికింద్రాబాద్‌కు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు వారంలో 6 రోజులు పాటు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని ఒక్క మంగళవారం మాత్రమే అందుబాటులో ఉండదని తెలియజేశారు.

ఆశాజనకంగా భూ రీ సర్వే

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులు రైతులు, స్థానికుల సహకారంతో ఆశాజనకంగా కొనసాగుతున్నాయని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జేసీ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే నిర్వహించిన చాలా భూములకు పట్టాలు కూడా పంపిణీ చేశామన్నారు. ముఖ్యంగా ఎంతో కాలం నుంచి ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న గ్రామ కంఠం భూములకు కూడా సర్వే నిర్వహించామని చెప్పారు. చేసిన సర్వేల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. జాతీయ ప్రాజెక్టులైన రహదారులు, రైల్వే లైన్ల విస్తరణ, కెనాల్స్ ఇలా ప్రతి అంశానికి సంబంధించిన భూ సేకరణ జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా వరకు ఫైనల్ అయ్యిందని చెప్పారు. డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

- భార్య మృతి వార్త తెలిసి భర్త ఆత్మహత్య
- అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులు

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆ మహిళ తీసుకున్న తొందరపాటు నిర్ణయం కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. భార్య మృతి చెందిందని మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్యకు పాల్పడగా, ముగ్గురు చిన్నారులు అనాథలుగా మిగిలారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ పినపాడుకు చెందిన తాడిబోయిన చంద్రశేఖర్‌సాయి(24), వెంకటలక్ష్మీభవాని(24) ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు, ఏడాది వయసున్న కవల కుమార్తెలు ఉన్నారు. దుకాణాల్లో గుమాస్తాగా పని చేసే సాయి ఇటీవల ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బులు ఇవ్వడంలేదు. భార్యాభర్తల మధ్య ఈ విషయమై తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీ సాయంత్రం భవానీ ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులు చినకాకానిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. భార్య మృతి చెందిందన్న సమాచారం తెలుసుకున్న సాయి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్షణికావేశంలో భార్యాభర్తలిద్దరూ తీసుకున్న నిర్ణయాలతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మిగిలారు. త్రీ టౌన్ పోలీసులు రెండు కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనాథ్‌రెడ్డిది విలక్షణ వ్యక్తిత్వం

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ సంస్మరణ సభలో ప్రభుత్వ సలహాదారు సజ్జల


ప్రసంగిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో అమర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సి. రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డిది విలక్షణమైన వ్యక్తిత్వమని ప్రభుత్వ సలహాదారు(ప్రజావ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం విజయవాడ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. తొలుత సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు శ్రీనాథ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. సజ్జల మాట్లాడుతూ వాస్తవానికి శ్రీనాథ్‌రెడ్డి భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చారని, ఆయన జర్నలిజంలోకి అనుకోకుండా వచ్చి ఉండొచ్చని తాను భావిస్తున్నానన్నారు. బహుశా ఆయన వ్యక్తిత్వంలోనే జర్నలిజం తాలూకా విలక్షణత ఉండి ఉంటుందన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య, గ్రూపుల మధ్య సమస్య ఉన్నా నిష్పక్షపాతంగా, కఠినంగా తాను చెప్పాలనుకున్న విషయం చెప్పే లక్షణం ఆయనకు తొలి నుంచి ఉందన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా మార్పు కోసం ఎంతో పరితపించారన్నారు. కరోనా సమయంలోనూ జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంచుకునేందుకు కృషి చేశారన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ భాగస్వామ్యంతో జర్నలిస్టులకు సర్టిఫికెట్ కోర్సు అందించారన్నారు. ఆయన మ రణం వ్యక్తిగతంగా తనకు, జర్నలిజానికి తీరని లోటన్నారు.

ఆయన పేరుమీద గోల్డ్ మెడల్ ఇవ్వాలి..

రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి పేరు మీద యోగి వేమన యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందించేందుకు కృషి చేయాలన్నారు. శ్రీనాథ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అంతకు ముందుకు ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డి రాయలసీమ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. అనంతరం సజ్జల ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరించారు. సభలో ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, కె. జయరాజు, చావా రవి ఉన్నారు.

సేవలలో మంగళగిరి ఎయిమ్స్ రికార్డు

- నాలుగేళ్లలో పది లక్షల మందికి వైద్య సేవలు
- ప్రధాని, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి అభినందనలు


ఎయిమ్స్ ఓపీ విభాగం భవనం

మంగళగిరి: మంగళగిరిలోని ఆలిండియా ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) రికార్డు నెలకొల్పింది. నాలుగేళ్లలో 10లక్షల మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్‌ను అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. రాష్ట్ర విభజన అనంతరం మంగళగిరి వద్ద 200 ఎకరాలలో రూ.1618 కోట్లతో ఎయిమ్స్ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. 2015 డిసెంబర్ 19వ తేదీన అప్పటి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. 2018 నాటికి భవన నిర్మాణాలు కాగా 2019 డిసెంబర్ 9వ తేదీన ఆసుపత్రిలో రోగులకు ఔట్ పేషెంట్(ఓపీ)ని ప్రారంభించారు. 2018లో డైరెక్టర్‌గా డాక్టర్ ముఖేష్ త్రిపాఠి, ప్రెసిడెంట్‌గా డాక్టర్ పిఎస్ రవికుమార్‌లను సిబ్బందిని నియమించారు. ఓపీ ప్రారంభించిన నాలుగేళ్లలోనే 10 లక్షల మంది రోగులకు వైద్య సేవలందించి రికార్డు సృష్టించారు. ఎయిమ్స్ నిర్వాహకులను దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండ్యా, ఆరోగ్య శాఖ సహాయమంత్రి భారతీ ప్రవీణ్ పవార్‌లతో పాటు పలువురు అభినందించారు. అతితక్కువ ధరలకే సామాన్యులకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి రోగులు తరలివచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. దీంతో రోగులు, సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 25 విభాగాలలో వైద్యులు రోగులకు సేవలందిస్తుండగా ప్రస్తుతం రోజుకు 3000కు పైగా రోగులు తరలివచ్చి వైద్య సేవలందుకుంటున్నారు.

అందరి సహకారంతోనే రికార్డు సాధించాం



ఎయిమ్స్ స్థాపించిన నాలుగేళ్లలో 10 లక్షల మంది రోగులకు సేవలందించి రికార్డు సృష్టించాం. వైద్యబృందం, సిబ్బంది అందించిన సహకారంతోనే ఇది సాధ్యమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రులు పలువురు ప్రముఖుల ప్రశంసలు లభించడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా రోగులకు సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలందిస్తున్న ఎయిమ్స్ వైద్య సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలి.

– డాక్టర్ ముఖేష్ త్రిపాఠి, డైరెక్టర్

పేరుపెట్టి పిలవటం నా జీవితంలో మరువలేను

వైద్యాధికారి ఇబ్రహీం



శావల్యాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నన్ను పేరు పెట్టి పిలవటం నా జీవితంలో మరిచిపోలేని రోజు అని మండల ప్రాథమిక వైద్యాధి కారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. గురువారం చిలుకలూరిపేట మండలం లింగగుంట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లా స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఫ్యామి లీ డాక్టర్ కార్యక్రమం శావల్యాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిలిచింది. జిల్లా స్థాయిలో నెల రోజులపాటు ఎంఎల్‌హెచ్‌వోలకు ప్రత్యేకంగా శిక్షణా ఇవ్వటంతో కీలకపాత్ర పోషించిన వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం సేవలను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ఆలింగనం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీలకు ఆరోగ్య సేవలపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహణకు రాష్ట్ర వైద్య ఆరోగ్య ప్రధానకార్యదర్శి కృష్ణబాబు వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీంను నియమించారు.


పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఐజీ సీఎం త్రివిక్రమ వర్మ.

మిరియాలలో వైభవంగా ఆవుదేవర తిరునాళ్ల

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో ఆవుదేవర తిరునాళ్ల గురువారం రాత్రి వైభవంగా జరిగింది. వేలాదిగా ప్రజలు ఆవుదేవరను దర్శించుకుని పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాత్రి ఆవుదేవర గుడికి విచ్చేసి ఆవుదేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గురువారం రాత్రి నుంచి యాదవులు వివిధ క్రతువులు నిర్వహించారు. ముందుగా పిల్లనగ్రోవి కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టలో ఉన్న పిల్లన గ్రోవిని దేవర భక్తుడు బయటకు తీసే కార్యక్రమం జరిగింది. తర్వాత ఆలయం ముందు ముగ్గు వేశారు. ఆ ముగ్గుపై పాలుపొంగించి ఆ తర్వాత దానిపై ఆవును నడిపించారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి గ్రామంలోని గోవులు, ఎద్దులను రైతులు గుడి చుట్టూ తిప్పి చల్లగా చూడాలని ఆవుదేవరను మొక్కుకునే కార్యక్రమం జరుగుతుందని దేవర ఆచారవంతులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ దార్ల జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు అరెస్ట్

మార్టూరు: తమ నివాసాల మధ్య గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఇద్దరిని పర్చూరు సెబ్ సీఐ యశోదరాదేవి గురువారం ఉదయం అరెస్టు చేశారు. సీఐ వివరాలు.. స్థానిక ఆది బాంబవ కాలనీలో బుధవారం రాత్రి సీఐ తమ బృందంతో దాడి నిర్వహించారు. అందులో భాగంగా కాలనీలో పక్కపక్క నివాసాల్లో ఉంటున్న చిన్న కర్ణిక కొండయ్య, పెద్ద కర్ణిక సాయమ్మలు తమ నివాసాల మధ్య పూల చెట్లలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న విష యాన్ని గుర్తించారు. 17 కిలోల బరు వు గల నాలుగు గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకొని కొండయ్యను అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం పరారీలో ఉన్న సాయమ్మను సైతం అధికారులు అదుపులోకి తీసుకొ ని కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు.

అంజన్నకు లక్ష తమలపాకుల అర్చన



అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగర కొండ ప్రసన్నాంజనేయస్వామికి పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తమలపాకులతో అర్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాతఃకాల సమయంలో సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, స్వామివారికి అభిషేకం, అలంకరణ, వేదపండితులు, అర్చకులు, ఉభయదాతల వేదస్వస్తి, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, వినాయక స్వామి వారికి సుబ్రహ్మణ్యస్వామి వారికి, జీవధ్వజ ఉష్టవహనానికి నారికేళ సమర్పణ, గణపతిపూజ, ఋత్విక్‌వరణ, 11 వరుసలుగా దేవస్థాన వేదపండితులు అర్చకులచే తమలపాకులతో అర్చన చేశారు. తరువాత స్వామివారికి మహానివేదన, పంచహారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన వీరిశెట్టి వెంకట్రావు, ధనలక్ష్మీ దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పులిచింతల నీటి మట్టం



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 41.1932 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 3,200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

జిల్లా కలెక్టరు (పౌ.స.)వారి కార్యాలయము, గుంటూరు

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. 370/2022-S7, తేది. 06.04.2023

శ్రీయుత కమిషనర్, పౌర సరఫరాల శాఖ వారి ఆదేశముల మేరకు జిల్లాలోని వివిధ మండల స్థాయి గోదాములు వద్ద నిల్వ ఉన్న సుమారు 3478.15 క్వింటాళ్ల సీజ్ చేయబడిన బియ్యముకు సంబంధించి బహిరంగ వేలము వేయుటకు నిర్ణయించిన ప్రకారము ఈ క్రింది తెలుపబడిన మండల స్థాయి గోదాముల నందు గల బియ్యము వివరములు ప్రకారము బహిరంగ వేలము జరిపించుటకు నిర్ణయించడమైనది.

వరుస సంఖ్య	సీజ్ చేయబడిన బియ్యం నిల్వల పరిమాణం క్వింటాళ్లలో	బియ్యం నిల్వలు ఉన్న మండల స్టాక్ పాయింట్ల వివరము
1	2451.08	యం.యల్.యస్. పాయింట్, గుంటూరు అర్బన్
2	267.82	యం.యల్.యస్. పాయింట్, గుంటూరు రూరల్
3	228.73	యం.యల్.యస్. పాయింట్, ప్రత్తిపాడు
4	12.45	యం.యల్.యస్. పాయింట్, మంగళగిరి
5	146.06	యం.యల్.యస్. పాయింట్, తాడికొండ
6	102.71	యం.యల్.యస్. పాయింట్, తెనాలి
7	269.30	యం.యల్.యస్. పాయింట్, పొన్నూరు
మొత్తం	3478.15	

వేలం జరుగు ప్రదేశము : DRC మీటింగ్ హాల్, కలెక్టర్ వారి కార్యాలయం, గుంటూరు
తేది : 12.04.2023, ఉదయం 10.30 గంటలకు

నిబంధనలు : 1.బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావత్తు రు. 1,00,000/- లు డి.డి. రూపంలో జిల్లా సరఫరా అధికారి, గుంటూరు వారి పేరున చెల్లించి తేది. 12.04.2023 ఉదయం 10.00 గంటల లోపు అప్లికేషను పొందవలెను. 2.కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు వారి లైసెన్సు ఉన్న ట్రేడర్ / రైస్ మిల్లర్ అయి ఉండవలెను. 3.వేలము ముగిసిన అనంతరము, వేలము కోసం చెల్లించిన పైకమునకు సంబంధించిన రశీదు తీసుకొని (Un successful Bidder) డి.డి. తిరిగి ఇవ్వబడును. 4. బహిరంగ వేలములో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారికి సరుకును స్వాధీన పరచుట అనేది జిల్లా సంయుక్త కలెక్టర్, గుంటూరు వారి ఉత్తర్వులకు లోబడి ఉండును. 5. జిల్లా సంయుక్త కలెక్టర్, గుంటూరు వారు అనుమతించిన సమయము 05 రోజుల లోపల పాటకు సంబంధించిన మొత్తం పైకము చెల్లించి సరుకును పైకము చెల్లించిన నాటి నుండి 10 రోజుల లోపు స్వాధీనం చేసుకొనవలెను.6. వేలము వేయు సరుకును కార్యాలయ పనిదినములలో వేలము జరుపుటకు ముందు రోజులోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పైన పట్టికలో తెలుపబడిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును.7. బహిరంగ వేలములో ఎక్కువ వేలం పాడిన బిడ్డర్ / రైస్ మిల్లర్ వారు, రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను. తీసుకొన్న సరుకును 10 రోజుల లోపు వినియోగించుకొనవలయును. 8. వేలం వేసిన బియ్యం ముసుగులో పి.డి.యస్ బియ్యం / స్టాకులను దుర్వినియోగం చేయడం / సి.యం.ఆర్ గా రీసైక్లింగ్ చేయడాన్ని, బియ్యం వినియోగం పూర్తి అయ్యేంత వరకు వేలందారుని కదలికలు గమనించటం జరుగుచున్నది. 9. ఈ బహిరంగ వేలం అనేది సంయుక్త కలెక్టర్ వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

సం/- జిల్లా కలెక్టరు (పౌ.స.), గుంటూరు.

కెనరా బ్యాంక్ Canara Bank

గుంటూరు మెయిన్ బ్రాంచ్ హిందూ హైస్కూల్ క్యాంపస్ మెయిన్ రోడ్, గుంటూరు-522003. ☎ 0863-2221751

అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్ వారికి [illegible] కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్ అధీకృత అధికారిచే [illegible] తేది 10.05.2023న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని [illegible] తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 10.05.2023 | ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 08.05.2023, సా॥ 4.30 గం.ల లోపు

1. రుణగ్రహీత(లు): M/s ఓం సాయి రామ్ ఎంటర్‌ప్రైజెస్ [illegible] శ్రీ నాగభైరు చంద్ర శేఖర బాబు [illegible] శ్రీమతి నాగభైరు శ్రీదేవి. తేది 30.03.2023 నాటికి బకాయి మొత్తం: రూ. 229.83 లక్షలు + [illegible]
బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తి వివరములు: ఆస్తి నెం-1: గుంటూరు [illegible] 10180/2006 తేది. 6.12.2006 [illegible] 413 చదరపు గజాల [illegible]
రిజర్వు ధర: రూ. 39.03 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 4.00 లక్షలు
ఆస్తి నెం-2: గుంటూరు జిల్లా, చిలకలూరిపేట మండలం, [illegible] డి.నెం: 49/1 నందు [illegible] 7047/2010 తేది. 24.08.2010 [illegible]
రిజర్వు ధర: రూ. 18.00 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 1.80 లక్షలు
ఆస్తి నెం-3: గుంటూరు జిల్లా, చిలకలూరిపేట మండలం, [illegible] డి. నెం: 49/1 నందు [illegible] 7046/2010 తేది. 24.08.2010 [illegible]
రిజర్వు ధర: రూ. 18.15 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ.1.82 లక్షలు
ఆస్తి నెం-4: [illegible] 777.10 [illegible] 1100 [illegible] 2 బెడ్ రూమ్ ఫ్లాట్ నెం.1బి. [illegible]
రిజర్వు ధర: రూ. 40.70 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 4.10 లక్షలు
2. రుణగ్రహీత(లు): మెసర్స్ [illegible] శ్రీమతి ఇసగంటి అనిత, [illegible] తేది 31.03.2023 నాటికి బకాయి మొత్తం: రూ. 278.40 లక్షలు + [illegible]
బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తి వివరములు:
ఆస్తి నెం.1: [illegible] 172-1/2 [illegible] 80.2/9 [illegible] 32.3/9 [illegible] 59.1/2 [illegible]
రిజర్వు ధర: రూ. 15.43 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 1.60 లక్షలు
ఆస్తి నెం.2: [illegible] 113.1/3 [illegible]
రిజర్వు ధర: రూ. 14.64 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 1.50 లక్షలు
ఆస్తి నెం.3: [illegible] 360 చ॥గజాల స్థలం. [illegible]
రిజర్వు ధర: రూ. 10.97 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 1.10 లక్షలు
ఆస్తి నెం.4: [illegible] 266.66 చ॥గజాల [illegible]
రిజర్వు ధర: రూ. 7.60 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 0.80 లక్షలు
ఆస్తి నెం.5: [illegible] 1399.70 చ॥గజాల [illegible]
రిజర్వు ధర: రూ. 39.06 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 4.00 లక్షలు
ఆస్తి నెం.6: [illegible] 239.00 చ॥గజాల [illegible]
రిజర్వు ధర: రూ. 6.67 లక్షలు | ధరావత్తు సొమ్ము: రూ. 0.70 లక్షలు

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్, చీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు: ఫోన్: 8331015700.
ఇ-వేలం విధాను మరియు నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com పేరు: శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.

తేది: 31.03.2023, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్